క్లుప్తంగా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఉప్పలగుప్తంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ చిన్నవరాజు

ఉప్పలగుప్తం: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్న నేపథ్యంలో మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో బుధవారం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పండు శ్రీనుబాబు, దోనిపాటి వేణు, దాసి జానకి, నడింపల్లి సుబ్బరాజు, కందేరి కృష్ణమూర్తి, పెయ్యిల బాలకృష్ణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముమ్మిడివరం: కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక యువకుడు పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ముమ్మిడివరం మండలం బూరుగుల్లంకకు చెందిన చింతలపూడి లోవరాజు(30) ఈ నెల 12న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడటంతో కుటుంబ సభ్యులు అతడిని కాకినాడ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. లోవరాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు ఎస్ఐ డి.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



గొల్లవిల్లి పాఠశాలలో ఆటల పోటీలను పరిశీలిస్తున్న మధుసూదనరావు

ఉప్పలగుప్తం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా సమగ్ర శిక్షా ఏపీడీ ఎ.మధుసూదనరావు అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలను తమ దిన చర్యలో భాగం చేసుకోవాలన్నారు. తద్వారా మానసిక ఒత్తిడి తగ్గడంతో పాటు గెలుపు, ఓటములను సమ దృష్టితో స్వీకరించగలిగే తత్వం అలవడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సత్తి సత్యకృష్ణ, హెచ్ఎం ఎల్.రాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యేషేయా వర్ధంతి



చల్లపల్లిలో కుంచే యేషేయా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉప్పలగుప్తం: అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్‌సీడ్ ఫౌండేషన్ అధినేత కుంచే రమణారావు తండ్రి కుంచే యేషేయా 10వ వర్ధంతిని చల్లపల్లి జగ్గిరాజుపేటలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని యేషేయా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, పెయ్యిల రాజ్‌కుమార్, జొన్నాడ శ్రీదుర్గ, ఎంపీటీసీలు పెట్టా అప్పారావు, కొంకి ఏడుకొండలు, మోటూరి సత్యంకాపు, పినిపే జయరాజు, పోతుమూడి కొండబాబు, పెయ్యిల విష్ణుమూర్తి పాల్గొన్నారు.

నరసాపురం ఎంపీడీవో మృతికి సంతాపం

అమలాపురం రూరల్: నరసాపురం ఎంపీడీవో ఎస్వీ రమణరావు మృతికి అమలాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీరాజ్ ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు. రమణారావు చిత్రపటానికి అమలాపురం ఎంపీడీవో మల్లిఖార్జునరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ఎస్ఎస్ సూరపరాజు, కార్యదర్శులు ఆదినారాయణ, కేఎస్ ప్రసాద్, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి

అమలాపురం టౌన్: స్థానిక ఎత్తు రోడ్డు వద్ద గల వెంకట కృష్ణాపురంలో నవయుగ కవి గుర్రం జాషువా 53వ వర్ధంతి కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడికి శ్రీరాములు మాట్లాడుతూ గుర్రం జాషువా రచనలు సమాజ శ్రేయస్సు, సామాజిక బాధ్యతను తెలియజేసేలా ఉంటాయని కొనియాడారు. కార్యక్రమంలో మడికి సత్యనారాయణ, కవి సీలి శాంసన్, నొంద్రు వాడపల్లి, సింగపల్లి ఏసుదాసు, నూటికుర్తి శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.



యానాం పట్టణంలోని అయ్యన్ననగర్‌లోకి ప్రవేశించిన వరదనీరు



వరద నీటిలో చిక్కుకున్న బోడసకుర్రు పల్లిపాలెం



మురమళ్ల వద్ద నీట మునిగిన మత్స్యకారుల ఇళ్లు



పల్లెగూడెంలో ఇళ్లలోకి చేరిన వరద నీరు



బోడసకుర్రులో మునిగిన ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు తదితరులు

చుట్టూ నీళ్లు.. మధ్యలో ఊళ్లు

- లోతట్టు ప్రాంతాల జలమయం
- ముంపు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు



లంకాఫ్ ఠానేల్లంకలో ముంపు నీటిలో స్కూలుకు వెళుతున్న విద్యార్థులు



గురజాపులంకలో మునిగిన ప్రధాన రహదారి



లంకాఫ్ ఠానేల్లంకలో నీట మునిగిన కొబ్బరి తోటలు

ముమ్మిడివరం/అల్లవరం/ఐ.పోలవరం/యానాం: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. గౌతమి, వృద్ధ గౌతమి నదులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. అన్నంపల్లి అక్విడెక్టు వద్ద వరద పరవళ్లు తొక్కుతోంది. బోడసకుర్రు జాతీయ రహదారి వద్ద వైనతేయ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. ఇప్పటికే అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో ముంపు గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. లంక గ్రామాల్లో సాగు చేసిన వంగ, బెండ, బీర, మిర్చి, ఆనప తదితర పంటలు నీట మునిగాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా లంక గ్రామాల్లో వృద్ధులు, గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గురువారం నాటికి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద తగ్గుతుందని అధికారులు చెబుతుండడంతో ముంపు ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.

ముంచెత్తిన వరద

- ఐ.పోలవరం మండలంలోని పాగాకులంక, పల్లెగూడెంలో గ్రామాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసినా అక్కడి నుంచి వెళ్లేందుకు గ్రామస్తులు ఒప్పుకోవడం లేదు. మురమళ్ల రాఘవేంద్ర వారిధి వద్ద మత్స్యకార కాలనీలో వరద ఉధృతి మరింత పెరిగింది. ఎదుర్లంక వారధిని ఆనుకుని ఎదుర్లంక, పాత ఇంజరం, కొమరగిరిలో ఏటిగట్లను వరద నీరు తాకుతోంది. ఇక్కడ కొబ్బరి, ఇతర అంతర పంటలు పూర్తిగా నీట మునిగాయి.
- ముమ్మిడివరం మండలంలోని లంక గ్రామాలైన లంకాఫ్ ఠానేల్లంక, గురజాపులంక, కూనాలంక, లంకాఫ్ గేదెల్లంక, చింతపల్లిలంకల్లో వరద నీరు నివాస గృహాలను చుట్టుముట్టింది. అంతర్గత, ప్రధాన రహదారులను వరద ముంచెత్తింది. లంక గ్రామాల్లో మినహా పాఠశాలలన్నీ మూతపడ్డాయి. మిగిలిన గ్రామాల్లో సైతం విద్యార్థులు ముంపునీటిలో ఇబ్బందులు పడుతూనే పాఠశాలకు వెళ్తున్నారు. లంక గ్రామాల్లో పశువులకు అవసరమైన పశుగ్రాసం అందించి పశువులకు వ్యాక్సిన్లు వేసే ప్రక్రియను చేపట్టారు.
- లంకాఫ్ ఠానేల్లంక నుంచి గురజాపులంకకు వెళ్లే సీసీ రోడ్డు వరద నీటిలో మునిగింది. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. కమిని, సలాదివారిపాలెం, శేరుల్లంక, పొట్టితిప్ప, కొత్త లంక గ్రామాల్లో వరద ఉధృతికి విలువైన లంక భూములు కోతకు గురవుతున్నాయి.
- గోదావరి వరద కారణంగా యానాం నియోజకవర్గ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ సందర్భంగా అయ్యన్ననగర్, ఓల్డ్‌రాజీవ్‌నగర్, బాలయోగి కాలనీ, ఫెర్రీరోడ్డు, బీచ్‌రోడ్డు తదితర ప్రాంతాల్లోకి వరద నీరు రావడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు సైతం మునిగిపోవడంతో అత్యవసర పనులున్నా బయటకు వెళ్లేందుకు సైతం వీలు లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాలను ఆర్ఏఓ మునిస్వామి తదితర అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు.

వరద బాధితులకు పరామర్శ

వరద ప్రభావిత ప్రాంతాల్లో డీఎంఅండ్‌హెచ్ఓ ఎం.దుర్గారావు దొర ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. అల్లవరం మండలం బోడసకుర్రు స్థానిక ఎంపీపీ పాఠశాల ఆవరణలో వరద బాధితులకు పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి భోజనాలు అందిస్తున్నారు. వరద నీటిలో ఉన్న వారికి తాగునీటి టిన్నులను పడవపై వెళ్లి అందిస్తున్నారు. వరద తీవ్రతతో అంటు వ్యాధులు ప్రబలకుండా డీఎల్‌పీఓ బొజ్జిరాజు శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించి వీధుల్లో బ్లీచింగ్ చేస్తున్నారు. వరద ప్రభావ ప్రాంతంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, ఎంపీటీసీ బస్వాని పద్మ వరద బాధితులను పరామర్శించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు వరద బాధితులతో మాట్లాడారు. వరద ప్రభావిత ప్రాంతంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీఏ కృష్ణమోహన్, మండల స్థాయి అధికారులు వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

బలహీనంగా గోదావరి ఏటిగట్టు

- ఆందోళనలో లంక గ్రామాల ప్రజలు
- కొత్తలంకకు పొంచి ఉన్న ముప్పు

తాళ్లరేవు: మండల పరిధిలోని పిల్లంక గ్రామ పంచాయతీ కొత్తలంక గ్రామానికి వరద ముప్పు పొంచి ఉంది. గోదావరి ఉధృతి పెరగడంతో కొత్తలంక గ్రామానికి వరద నీరు పోటెత్తుతోంది. ఇప్పటికే గ్రామంలోని పల్లపు ప్రాంతాలన్నీ జలమయమై గ్రామంలోకి సైతం వరద పోటెత్తుతోంది. దీంతో లంక వాసుల్లో ఆందోళన మొదలైంది. గురువారం ఉదయానికి కొత్తలంక గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా మునిగిపోయే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామ ప్రజలతో పాటు మూగ జీవాలు కూడా ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంటుందని, పునరావాస చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. యానాం నుంచి పిల్లంక వరకూ గౌతమి గోదావరి ఏటిగట్టు పలుచోట్ల బలహీనంగా ఉండడంతో లంక వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి ఉధృతికి ఏటిగట్టు కరిగిపోతుండడం, గోవలంక ఇసుక ర్యాంపు సమీపంలో ఏటిగట్టు బలహీనంగా ఉండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. యానాం నుంచి రావులపాలెం వరకూ నిత్యం అనేక వాహనాలు ఇదే ఏటిగట్టు రహదారిపై ప్రయాణిస్తూ ఉంటాయి. తక్షణమే ఏటిగట్టును పటిష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రక్షణ కవచంగా టైడల్ లాక్

గోదావరి పాయలో వరద ఉధృతి పెరగడంతో లంక గ్రామాల ప్రజలలో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రధానంగా తాళ్లరేవు, కాజులూరు, కరప మండలాల్లోని సుమారు 30 వేల ఎకరాలు ఆయకట్టుకు వరద ముప్పు పొంచి ఉంటుంది. వరద ముంపు నుంచి గ్రామాలతో పాటు పంట పొలాలను రక్షించేందుకు నీలపల్లి–యానాం సరిహద్దులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలో నిర్మించిన టైడల్ లాకు రక్షణ కవచంగా నిలిచింది. వరద హెచ్చరికల నేపథ్యంలో ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ అధికారులు సకాలంలో టైడల్ లాక్ గేట్లు మూసివేయడంతో పాటు వరదనీరు లీకవకుండా ఇసుక బస్తాలు పటిష్టంగా వేయడంతో గ్రామాలతో పాటు పంట పొలాలు వరద గండం నుంచి బయటపడ్డాయి.



గోవలంక వద్ద ప్రమాదకరంగా మారిన ఏటిగట్టు రహదారి



కొత్తలంక గ్రామాన్ని ముంచెత్తుతున్న వరదనీరు



యానాం-నీలపల్లి సరిహద్దులో మూసివేసిన టైడల్ లాకు గేట్లు

పునరావాస చర్యలు చేపట్టాలి



వరద నీరు గ్రామంలోకి ప్రవేశిస్తుంది. దీనివల్ల ముఖ్యంగా తాటాకు ఇళ్లలో నివసించే వారికి నిలువ నీడ లేకుండా పోతుంది. అదేవిధంగా వరద నీటి కారణంగా పశువులను గ్రామంలో కట్టే పరిస్థితి లేకుండా పోతుంది. ప్రభుత్వం తక్షణమే పునరావాస చర్యలు చేపట్టాలి.

– కాగిత రాజు, ఉప సర్పంచ్, కొత్తలంక, పిల్లంక పంచాయతీ

ఏటిగట్టును పటిష్టం చేయాలి



వృద్ధ గౌతమి గోదావరి పొడవునా ఏటిగట్టు పలుచోట్ల బలహీనంగా ఉంది. దీంతో ఎప్పుడు ఏ సమయంలో జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. ఇదే ఏటిగట్టుపై నిత్యం అనేక వాహనాలు సంచరిస్తుంటాయి. పలుచోట్ల ఏటిగట్టు రహదారి కుంగిపోయింది. వెంటనే ఏటిగట్టును పటిష్టం చేయాలి.

– కూరాటి వాసు, గ్రామస్తుడు, గోవలంక

తాగునీరు, ఆహారం అందించాలి



వరద బాధితులకు ప్రభుత్వం ఆహారంతో పాటు తాగునీటిని సరఫరా చేయాలి. ముఖ్యంగా వరద పోటెత్తితే తాగునీరు అందక లంక వాసులు ఇబ్బందులు పడుతుంటారు. వరద కారణంగా పనులుండవు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవాలి.

– వడ్డి ఏడుకొండలు, సుంకరపాలెం

ఓడీఎఫ్ సర్వే వంద శాతం పూర్తి చేయాలి



ఓడీఎఫ్ సర్వేపై మాట్లాడుతున్న తహసీల్దార్ సునీల్‌కుమార్

అల్లవరం: వ్యక్తిగత మరుగుదొడ్లకు నిధుల మంజూరు, నిర్వహణ తదితర అంశాలపై అన్ని గ్రామాల్లో వంద శాతం సర్వే పూర్తి చేయాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఓడీఎఫ్‌పై అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. మండలంలో 12 వేల గృహాలకు గాను 4 వేల గృహాలకు సర్వే చేశారని, మిగిలిన 8 వేల గృహాలకు త్వరగతిన సర్వే పూర్తి చేయాలన్నారు. ఓడీఎఫ్ సర్వే ఆధారంగా గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి స్వచ్ఛ నిధులు కేటాయిస్తారని తహసీల్దార్ సునీల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈ స్వామి, ఈఓపీఆర్డీ ఎస్వీవీ సత్యనారాయణ, కార్యదర్శులు రాజమోహన్, దుర్గా శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రీరామచంద్రమూర్తి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి జయంతి



అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సాహిత్యాభిమానులు

అమలాపురం టౌన్: జాతీయ గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతి వేడుకలను బుధవారం స్థానిక గాంధీనగర్‌లోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణయ్య చిత్రపటానికి శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అయ్యంకి ప్రజా గ్రంథాలయమే ప్రజల విశ్వవిద్యాలయమని చాటిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఉద్యమాల ఫలితంగానే రాష్ట్రంలో వేలాది గ్రంథాలయాలు వెలిశాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళా వేదిక జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ మాకే బాలార్జున సత్యనారాయణ, గ్రంథాలయ సహాయకుడు పోలిశెట్టి సత్యనారాయణ మూర్తి, న్యాయవాది ఎం.మోహనరావు, డి.సత్యవేణి, సీహెచ్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు



కేంద్రమంత్రి మేఘవాల్‌ను కలిసిన ఎమ్మెల్యే అశోక్

యానాం: పుదుచ్చేరిలో బీజేపీ-ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి ప్రభుత్వానికి మద్దతునిస్తున్న అసంతృప్త బీజేపీ ఎమ్మెల్యేలు, స్వతంత్ర ఎమ్మెల్యేల బృందం బుధవారం కేంద్రమంత్రి అర్జురామ్ మేఘవాల్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి లోక్‌సభ స్థానంలో బీజేపీ ఓటమి చెందడం, సీఎం రంగసామి, హోంమంత్రి నమశ్శివాయం వ్యవహారశైలి తదితర విషయాలపై ఆయనకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ పోస్టుల గురించి ఆయనతో చర్చించారు. మంత్రులంతా రెండు పార్టీల నుంచి రొటేషన్ పద్ధతిలో ఉండాలని కోరారు. వీరంతా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తదితర జాతీయ నాయకులను కలవనున్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కల్యాణసుందరం, గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, అంగలన్, శివశంకర్, రిచర్డ్, జాన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్



పత్తిగొంది‌లో కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రైతులు



యానాంలో కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

తాళ్లరేవు: గోదావరి జిల్లాల్లో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించిన అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ అని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పత్తిగొంది గ్రామంలో బుధవారం కాటన్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాలు సస్యశ్యామలం కావడానికి కారకుడైన కాటన్ చిరస్మరణీయులని కొనియాడారు. కార్యక్రమంలో శీలం సత్యనారాయణ, ధూళిపూడి వీరభద్రరావు, రాము, రాహుల్, తాతయ్య, సత్యకృష్ణ, విల్ల సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా కాటన్ వర్ధంతి

యానాం: గోదావరి జిల్లాల పాలిట అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతిని బుధవారం యానాంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రోడ్డులో కాటన్ విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్ఏఓ మునిస్వామి మాట్లాడుతూ ఆనకట్ట నిర్మాణం చేసి గోదావరి జిల్లాల రూపురేఖలను మార్చిన ఘనత కాటన్‌కు దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు మురుగానందన్, శేరు నూకరాజు, ఆర్ఏఓ ఆఫీసు సూపరింటెండెంట్ కాళ్ల సత్యనారాయణ, పీఆర్ఏ కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు బొలెరో వాహనం బహూకరణ



నవోదయకు వాహనాన్ని అందజేస్తున్న ఓఎన్‌జీసీ ఈడీ రత్నేష్‌కుమార్ తదితరులు

యానాం: స్థానిక మెట్టకూరు నవోదయ విద్యాలయ విద్యార్థుల వైద్య అవసరాలు, అత్యవసర సేవల కోసం ఓఎన్‌జీసీ సంస్థ బొలెరో వాహనాన్ని బహూకరించింది. బుధవారం విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డికి ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్ కుమార్ బొలెరో వాహనాన్ని అప్పగించారు. ఈ సందర్భంగా రత్నేష్‌కుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) ద్వారా నవోదయకు వాహనాన్ని సమకూర్చామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఏఓ మునిస్వామి 10, 12 తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు సుహిత ఏంజెల్, ప్రణీత్, సాయిచరణ్, జ్ఞానశ్రీ, విశాలాక్షి, ఆదిత్య, ప్రశాంత్‌కుమార్, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో సీటు సాధించిన జోయల్ ఆకాష్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి లక్ష్మణ్‌ప్రవీణ్, షిల్లాంగ్ నవోదయ ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాష్‌రావు, ఉపాధ్యాయులు సాంబశివరావు, జయప్రకాష్, లక్ష్మయ్య, పాపారావు, దత్తశాస్త్రి, ప్రసన్నలక్ష్మి తదితరులు హాజరయ్యారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లరేవు: సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 26న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కాకినాడ సబ్ డివిజనల్ ఈఈ జి.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజరం, కోలంక, సుంకరపాలెం, ఉప్పంగల, పిల్లంక, గోవలంక, తంగేటిపంపు, తాళ్లరేవు, పి.మల్లవరం, జార్జిపేట, గాడిమొగ, భైరవపాలెం, పోలేకుర్రు, సీతారామపురం, కోరంగి, పెదబొడ్డు వెంకటాయపాలెం, చొల్లంగి, చొల్లంగిపేట, పటవల తదితర గ్రామాల్లో గురువారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

5 కేవీ సోలార్ ప్యానళ్ల ఏర్పాటు

యానాం: పట్టణ పరిధిలో పుదుచ్చేరి పర్యాటక శాఖకు చెందిన సీగల్స్ రెస్టారెంట్‌లో ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన 5 కేవీ సోలార్ ప్యానళ్లను ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్‌కుమార్, ఆర్ఏఓ మునిస్వామి బుధవారం ప్రారంభించారు. రత్నేష్‌కుమార్‌ను దుశ్శాలువాతో సత్కరించారు.

రాజధాని నిర్మాణానికి ఇచ్చేది అప్పుగానా, గ్రాంటా?



కారెం వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కన్వీనర్, అమలాపురం

అమలాపురం టౌన్: రాష్ట్ర రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు ఇస్తామన్న కేంద్ర ప్రభుత్వం.. వాటిని నిధులుగా ఇస్తుందో, అప్పుగా ఇస్తుందోనన్న విషయాన్ని తేల్చలేదని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. మల్టీ లేటరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల ద్వారా రూ.15 వేల కోట్లతో ఆర్థిక మద్దతు ఇస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి చెప్పడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని కేంద్రం ప్రభుత్వం పదేళ్లుగా చెబుతున్నా.. నిధులు ఇస్తున్న పాపాన పోలేదని విమర్శించారు. కోనసీమ రైల్వే లైన్‌కు గత ఫిబ్రవరిలో కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తప్ప ప్రస్తుత బడ్జెట్‌లో అదనంగా నిధులు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఉపాధి హామీ కూలీలకు కూడా ఈ బడ్జెట్‌లో నిధుల కోత విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలకు వరాలు ఇచ్చి, సామాన్య ప్రజలపై భారం మోపేలా కేంద్ర బడ్జెట్ ఉందని వ్యాఖ్యానించారు. స్పష్టమైన నిధుల సాధన కోసం రాష్ట్ర కూటమి ప్రభుత్వంలోని టీడీపీ, జనసేన పార్టీల అధినేతలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.